క్లుప్తంగా

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ, మున్సిపల్ కమిషనర్

మధిర: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్ అన్నారు. గురువారం మధిరలోని ఇండోర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమణగుప్తా, మాజీ కౌన్సిలర్ వాసు, శిబిరం నిర్వాహకులు చిన్ని, షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ సునీల్, కబడ్డీ కోచ్ ప్రవీణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని/బోనకల్: చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. చింతకాని మండలం జగన్నాధపురం వద్ద గురువారం చేపట్టిన తనిఖీల్లో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, బాధ్యులపై కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. అలాగే, చిన్నమండువ మున్నేరు నుంచే ఇసుక తరలిస్తుండగా మరో ట్రాక్టర్‌ను బోనకల్ వద్ద సీజ్ చేసినట్లు ఎస్సై పొదిలి వెంకన్న తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి

చింతకాని: తండ్రిపై దాడి చేసిన మండలంలోని పాతర్లపాడుకు చెందిన సామినేని శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. కౌలు డబ్బు విషయమై శ్రీనివాస్‌ను ఆయన తండ్రి భద్రయ్య బుధవారం రాత్రి ప్రశ్నించాడు. దీంతో తండ్రిని దూషిస్తూ అరకతో కొట్టడంతో భద్రయ్య కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ఈమేరకు గురువారం భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

జలబిందెల ఊరేగింపు



జలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ముదిగొండ: కాటమయ్య దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని బాణాపురంలో గురువారం జలబిందెల ఊరేగింపు నిర్వహించారు. గణపతి పూజ కార్యక్రమం నిర్వహించి, అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు, యువతులు, యవకులు నృత్యం చేశారు.

రవికుమార్ సేవలు అభినందనీయం..



రవికుమార్‌ను సన్మానిస్తున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: న్యాయశాఖలో విశేష సేవలందించిన జిల్లా 6వ అదనపు జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బోయినపల్లి రవికుమార్ సేవలు అభినందనీయమని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన బోయినపల్లి రవికుమార్ – ఉమారాణి దంపతులను సీనియర్ సివిల్ జడ్జి షేక్.మీరాఖాసీం సాహెబ్‌తో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రాజు, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, మోబిన్ అహ్మద్, బార్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, విద్య, పల్లవి, నిహాల్, రోహిత్, న్యాయవాదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఎస్సై రమేష్‌కుమార్

ఎర్రుపాలెం: మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్సై ఎం.రమేష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. కోడిపందేలు, పేకాట తదితర జూదాలు ఆడితే చర్యలు తప్పవన్నారు.

త్యాగాలు వృథాకానివ్వం

ఊరూరా మేడే వేడుకలు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), టీయూసీఐ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో జెండాలు ఎగురవేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీ, ప్రదర్శనలు చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. అమరుల త్యాగాలు వృథా కాకుండా కార్మికుల సంక్షేమానికి పోరాడాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



కారేపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



కొణిజర్ల: రామనరసయ్యనగర్‌లో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు



కల్లూరు: ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు



చింతకాని: సీపీఐ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



తల్లాడ: అన్నారుగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో..



వైరారూరల్: గొల్లెనపాడులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న సీపీఎం నాయకులు



సత్తుపల్లిరూరల్: తుమ్మూరులో.. హమాలీ వర్కర్ల యూనియన్ నాయకులు



ఎర్రుపాలెం: జెండా ఆవిష్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు



ముదిగొండ: అయ్యగారిపల్లిలో..



పెనుబల్లి: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..



బోనకల్: ముష్టికుంట్లలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



వేంసూరులో..



సత్తుపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, నాయకులు



వైరా: ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి భాస్కర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సత్తుపల్లిటౌన్: కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఏన్కూరులో..



కల్లూరురూరల్: యజ్ఞనారాయణపురంలో సీపీఎం ఆధ్వర్యంలో..

స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి సన్మానం



రష్మితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

పెనుబల్లి: మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన ఇందూరి సత్యనారాయణ చారి, నాగమణి దంపతుల కుమార్తె ఇందూరి రష్మిత ఇంటర్‌లో 996 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించింది. గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు దయానంద్ రష్మితను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఎంబీబీఎస్ పట్టా స్వీకరించిన ఎమ్మెల్యే కుమార్తె



పట్టా అందుకుంటున్న చందనతో ఎమ్మెల్యే దంపతులు

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ కుమార్తె చందన ఎంబీబీఎస్ పట్టా అందుకుంది. ఏపీలోని కడపలో ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె గురువారం జరిగిన కళాశాల స్నాతకోత్సవంలో పట్టా స్వీకరించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతులు కూడా పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో పెరిగిన ఉత్తీర్ణత

చింతకాని: మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం గతేడాదితో పోలిస్తే ఈసారి పెరిగింది. గతేడాది 86 శాతం నమోదు కాగా, ఈసారి 94 శాతానికి పెరగడం విశేషం. మండలంలోని 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు మూడు ప్రైవేట్ పాఠశాలల నుంచి 458 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 431 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది పాతర్లపాడు ఉన్నత పాఠశాలలో మాత్రం 100 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి మత్కేపల్లి, కొదుమూరు, చిన్నమండవ, తిమ్మినేనిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లూ ఆ ఘనత సాధించాయి. అలాగే, ప్రైవేట్ పాఠశాలలైన ఆదర్శ, గ్లోబల్, సెయింట్ థెరిస్సా స్కూళ్లలోనూ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 191 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా 170మంది, 160 మంది బాలికలు పరీక్ష రాయగా 154 మంది ఉత్తీర్ణతను సాధించి ముందంజలో నిలిచారు. ఇక నేరడ పాఠశాలలో 95 శాతం,



వందశాతం ఉత్తీర్ణత సాధించిన మత్కేపల్లి పాఠశాల వద్ద ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు 88, చింతకాని 94, పాతర్లపాడు 82, లచ్చగూడెం 95, రామకృష్ణాపురం 92, పందిళ్లపల్లి 81, నాగులవంచ పాఠశాల 97, కేజీబీవీలో 93 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చింతకాని ఉన్నత పాఠశాలకు చెందిన టి.యమున 552, కొదుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థి జి.గగన్య 533 మార్కులతో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలి



అడసర్లపాడులో మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ బాజ్జీ ప్రసాద్

వేంసూరు: మిల్లర్లు ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలని తహసీల్దార్ బాజ్జీ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని అడసర్లపాడు గ్రామంలోని లక్ష్మీ గణపతి, సాయి బాలాజీ రైస్ మిల్లులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని కటింగ్‌ల పేరుతో అలసత్వం చేస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం మిల్లర్ల వద్ద రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



వైరారూరల్: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

వైరారూరల్: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో తడిసిన ధాన్యపు రాసులను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకుల అలసత్వంతోనే రైతుల అగచాట్లు..

ఏన్కూరు: ప్రభుత్వ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ధాన్యం రైతులు అగచాట్లు పడుతున్నారని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండలంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని రైతుసంఘం బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు దుగ్గికృష్ణ, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరావు, మాడపాటి రాజేష్, ముక్తి బిక్షం, ఎర్రగడ్డ చంద్రయ్య, కొత్తపల్లి కనకరావు, రమేష్, ముక్తి వాసు తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో శ్రీసాయినాథుడికి గురువారం అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు పూజలు చేశారు. కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనిగండ్లపాడు, పెద్దగోపవరం, ఎర్రుపాలెం, రామన్నపాలెం, మీనవోలు, తదితర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆలయాల్లో భజనలు చేస్తూ గీతాలను ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని శ్రీసాయిబాబా నిలయంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాసరెడ్డి–నాగలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రికి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నవ్యకాంత్

కల్లూరు: స్ఫూర్తి ఫౌండేషన్ కల్లూరు కార్యాలయంలో గురువారం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి నవ్యకాంత్ ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించారు. కార్యాలయంలో అవసరాల నిమిత్తం యూఎస్‌ఏ దాతలు ఫౌండేషన్‌కు బహూకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ నవ్యకాంత్ మాట్లాడుతూ.. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలని, ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, ప్రతినిధి వరకా రామారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వలంటీర్లు ఉబ్బన బాబూరావు, జల్ది రామకృష్ణ, బీ.వీ. తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో ఇక్కట్లు..

ముదిగొండ: ముదిగొండ రోడ్డుపై ప్రయాణిస్తుంటే కళ్లలో దుమ్ముపడడంతో పాటు ఎదురుగా వస్తున్న వహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 16నెలలుగా ముదిగొండ నుంచి 5కిలోమీటర్ల మేరా, చిరుమర్రి వరకు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డును తవ్వి కంకర పరిచారు. ఈ రోడ్డుపై లారీలు, టిప్పర్లు తిరుగుతున్న సమయంలో ద్విచక్రవాహనదారుల కంట్లో పడడంతో పాటు రోడ్డు పక్కన నివాసగృహాలు దుమ్ముతో నిండిపోతున్నాయి. ఈ విషయమై ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం దుమ్ము లేవకుండా నీరు చల్లించినా బాగుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రోడ్డు పనులు త్వరిగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర రోడ్డుపై దుమ్ము లేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్లు మాకేవి ?

- అర్హులకు దక్కలేదని ఆవేదన
- గ్రామాల్లో జాబితా ప్రకటనలతో అలజడులు



వనంవారికిష్టాపురంలో గూడుకోసం ఎదురు చూస్తున్న మహిళ



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పంద్రేగుపల్లి గ్రామస్తులు (ఫైల్)

ముదిగొండ: తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం పెంకుటిళ్లలో, శిథిలమైన ఇళ్లలో, అద్దెలకు ఉండేవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో పేదలనుంచి అనేక దరఖాస్తులు రాగా.. వాటిని రెవెన్యూ ఆధ్వర్యంలో జీపీ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజాపాలనలో అర్హులను గుర్తించి నివేదికలు అందిజేయడం జరిగింది. దీంతో ఓ కొలిక్కి వచ్చిన దరఖాస్తులు సగానికి పైగా నిభంధనల ప్రకారం తిరస్కరించగా.. ఉన్న వారిలో ఎవరికి వస్తుందోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలోని వివరాలిలా..

ముదిగొండ మండలంలో 25 గ్రామపంచాయతీలుండగా, 33గ్రామాలున్నాయి. 85వేల మంది జనాభాలో మొత్తం ఓటర్లు 58,485మంది ఉన్నారు. మండల వ్యాప్తంగా 3,384మంది దరఖాస్తు చేసుకోగా.. సర్వేలో 2,363మందిని గుర్తించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయిన పిమ్మట పథకం అమలు పరిచేందుకు అధికారులు అన్నీ సిద్ధం చేశారు.

ఆందోళనలు..

- వనంవారికిష్టాపురంలో ఇందిరమ్మ కమిటీ పేరుతో పథకాన్ని అబాసుపాలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. లిస్టులో.. అసలు లబ్ధిదారులను పక్కనపెట్టి పొలాలున్నవారిని, చిరు ఉద్యోగులను, ఇళ్లున్న వారి పేర్లు ఉండటమేంటని ప్రశ్నిస్తున్నారు. అర్హులకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని ఆందోళనలు చేస్తున్నారు.
- పంద్రేగుపల్లిలో అర్హులను గుర్తించలేదని, ఇటీవల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొంతమంది లబ్ధిదారులు ధర్నా, ఆందోళన చేపట్టిన విషయం విధితమే. గంధసిరిలో కూడా అధికారులను అడ్డుకున్నారు. ఇలా పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో అవకతవకలు జరిగాయని, అధికారులు రీ సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
- అతి చిన్న గ్రామమైన ఖానాపురాన్ని అధికారులు గుర్తించి పైలెట్‌ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, మంత్రి కోమటిరెడ్డి చేతులమీదుగా అందరికీ ఇళ్ల పట్టాలు అందించారు. ఇప్పుడు 19మందిని ఎంపిక చేశారు. వీరిలో 13మంది లబ్ధిదారులు ముగ్గులు పోశారు. పట్టా చేతికొచ్చి మూడో దశలో చూస్తామని చెప్పి.. మాట దాటవేయంటం సరికాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని పైలెట్‌ప్రాజెక్ట్‌కింద ఎంపిక చేసిన తరువాత లబ్ధిదారులన పక్కదోవ పట్టించడం, గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

జాబితాలో పేరు లేదు..



నా పేరు రమాదేవి, నేను కొన్నేళ్లుగా రేకుల ఇంట్లో నా ఇద్దరు కూమార్తెలు, మనవరాళ్లతో నివాసముంటున్నాను. రోజూ కూలీపనులకు వెళ్తాను. ఈ ఇళ్లు గాలివానకు ఎప్పుడు కూలుతుందో తెలియదు. ఇదిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకుంటే.. ఇందిరమ్మ కమిటీ నాయకులు, అధికారులు కలిసి లిస్టులో పేరులేకుండా తొలగించారు. నాలాంటి పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలి.

– నెమలికొండ రమాదేవి, వనంవారికిష్టాపురం

కిరాయి ఇంట్లోనే జీవనం..



ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్ రూం ఇంటికి దరఖాస్తు చేసుకుంటే అప్పుడు లాటరీలో పేరు రాలేదు. అప్పటి నుంచి ఇల్లు లేక నా కుంటుంబంతో కిరాయి ఇంట్లో ఉంటన్నా. కూలీ చేసుకుంటేకానీ పూట గడవదు. మళ్లీ ఈ ప్రభుత్వంలో కూడా దరఖాస్తు చేసుకున్నా.. అయినా పేరు లేదని చెబుతున్నారు. అధికారులకు వినతి పత్రాలు కూడా అందించాం. ఈసారైనా ఇందిరమ్మ ఇల్లు ఇస్తారో లేదో మరి.

– బలంతు వెంకట్రావమ్మ, పంద్రేగుపల్లి